

గుడ్డు ధరకు రెక్కలు

డిమాండ్‌కు తగిన ఉత్పత్తి లేక కోడిగుడ్ల ధరకు రెక్కలొచ్చాయి. ప్రాంతాన్ని బట్టి రూ.8కి పైగానే పలుకుతోంది. 8లో



ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా..

ప్రజాస్వామ్య కోణానికి విరుద్ధంగా ప్రభుత్వాలు పాలన సాగిస్తున్నాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. 8లో

గరిష్టం / కనిష్టం
30° / 21°

వాతావరణం

జిల్లాలో సోమవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు సాధారణంగా ఉంటాయి. రాత్రి వేళ చల్లగా ఉంటుంది.

న్యూస్‌రీల్

వనసమారాధనతో మానసికోల్లాసం

జిల్లా జడ్జి రాజగోపాల్



మాట్లాడుతున్న జిల్లా జడ్జి రాజగోపాల్

ఖమ్మం లీగల్: వన సమారాధనతో మానసిక ప్రశాంతత, ఉల్లాసం కలుగుతాయని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్ అన్నారు. నగరంలోని శివాయిగూడెం వద్ద న్యాయవాది గోగినేని సుధాకర్ మామిడితోటలో ఆదివారం నిర్వహించిన వన సమారాధనకు ఆయన హాజరై మాట్లాడారు. భారతీయ సంస్కృతికి ఇలాంటి వేడుకలు ప్రతీకలని చెప్పారు. న్యాయవాదులంతా కుటుంబసభ్యులతో వచ్చి ఆనందంగా గడపడం హర్షణీయమని అన్నారు. ఈ సందర్భంగా చిన్నారుల నృత్య ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో ఖమ్మం బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నేరెళ్ల శ్రీనివాస్, చింతనిప్పు వెంకట్, న్యాయమూర్తులు కె.ఉమాదేవి, వి.అపర్ణ, డి.రాంప్రసాద్, ఎం. అర్చనాకుమారి, ఎం.కల్పన, కె.దీప, బి.రజని, వై.బిందుప్రియ, వి.మాధవి, ఆర్.శాంతిలత, శివరంజని, బార్ కౌన్సిల్ సభ్యుడు కొల్లి సత్యనారాయణతో పాటు ఉపేందర్ రెడ్డి, కండే వెంకట్, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

‘భోజనం’లో నాణ్యత పెరగాలి



వంటలను రుచిచూస్తున్న సీఎంఓ రాజశేఖర్ తదితరులు

ఖమ్మం అర్బన్ : పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం నాణ్యత పెంచాలని, విద్యార్థులు ఆరోగ్యంగా ఉండాలంటే పౌష్టికాహారం అవసరమని సీఎంఓ రాజశేఖర్ అన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఈ.సోమశేఖర శర్మ ఆధ్వర్యంలో ఖమ్మంలోని అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్‌లో ఆదివారం నిర్వహించిన మధ్యాహ్న భోజన కుక్ కం హెల్పర్ల జిల్లా స్థాయి వంటల పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్యంగా ఉన్నప్పుడే సక్రమంగా విద్యాభ్యాసన చేయగలుగుతారని అన్నారు. విద్యతోపాటు సృజనాత్మక అంశాలు, క్రీడల్లో ప్రతిభ చూపగలుగుతారని చెప్పారు. అందుకే మధ్యాహ్న భోజనానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. భోజనం వండి అందించే కుక్ కం హెల్పర్లకు భత్యం కూడా పెంచుతోందని చెప్పారు. ఈ పోటీలకు ప్రతీ మండలం నుంచి ఎంపికైన కుక్ కం హెల్పర్లు హాజరయ్యారని పేర్కొన్నారు. ఆ తర్వాత పోటీల్లో ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందించి అభినందించారు. కార్యక్రమంలో యూఆర్ఎస్ ప్రత్యేకాధికారి విరిత, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు సబ్ జూనియర్ హ్యాండ్‌బాల్ ఎంపికలు

ఖమ్మంస్పోర్ట్స్: ఉమ్మడి జిల్లాస్థాయి సబ్ జూనియర్ బాలుర హ్యాండ్‌బాల్ జట్టు ఎంపికకు సోమవారం పోటీలు నిర్వహిస్తున్నట్లు హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి డాక్టర్ పి.రఘునందన్ తెలిపారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో జరిగే పోటీలకు వయసు ధ్రువీకరణ పత్రాలతో పాటు ఆధార్‌కార్డుతో హాజరుకావాలని సూచించారు. ఇక్కడ ఎంపిక చేసే జిల్లా జట్టు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటుందని తెలిపారు.


అలరించిన ‘ఓహో మేఘమాల’



హాజరైన గాయనీ గాయకులు

ఖమ్మంగాంధీచౌక్: ఘంటసాల 102వ జయంతి సందర్భంగా ఆదివారం రాత్రి స్వరసుధ మ్యూజిక్ యూనిట్ ఆధ్వర్యంలో భక్త రామదాసు కళాక్షేత్రంలో నిర్వహించిన ‘ఓహో మేఘమాల’ సినీ సంగీత విభావరి ఆకట్టుకుంది. మొదట ఘంటసాల వెంకటేశ్వరరావు, ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వినూత్న, వి.లాస్యల సినీ నృత్య ప్రదర్శన, ప్రముఖ గాయకులు వి.రేవతి, డి.ప్రియాంక, కీర్తన, కె.మాధవరావు, వి.వి.రెడ్డి తదితరులు మధుర గీతాలు ఆలపించారు. కార్యక్రమంలో డి.సత్యానందం, ఎం.ఇజ్రాయేలు, కె.జనార్దన్ రావు, ఎండీ జాఫర్, ఇసనపల్లి నగేష్, పిన్నెల్లి యాదగిరి, పోరుపల్లి సురేష్, వనం కృష్ణవేణి, కె.వి.రమణారావు తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీ సాక్షిగా..



రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పగ్గాలు చేపట్టి ఏడాది పూర్తవుతోంది. ఈ నేపథ్యాన ప్రజాపాలన విజయోత్సవాలు జరుగుతుండగా శీతాకాల అసెంబ్లీ సమావేశాల నిర్వహణకు సిద్ధమైంది. ఈ సమావేశాల సాక్షిగా జిల్లాలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు మరింతగా ముందుకు సాగుతాయనే ఆశాభావం ప్రజల్లో వ్యక్తమవుతోంది. జిల్లా నుంచి ముగ్గురు మంత్రులు కొలువుదీరడం, ఉమ్మడి జిల్లాలో మెజార్టీ శాసనసభ్యులు కాంగ్రెస్ వారే కావడంతో ఇక్కడ అభివృద్ధిపై ప్రజలు ఆశలు పెట్టుకున్నారు. గత ఏడాది కాలంలో ఆ దిశగా పనిచేసిన మంత్రులు, ఎమ్మెల్యేలు రానున్న కాలంలో జిల్లాపై మరింత దృష్టి పెట్టాలని ఆకాంక్షిస్తున్నారు. అసెంబ్లీ శీతాకాల సమావేశాలు సోమవారం మొదలై వారం పాటు కొనసాగనున్నాయి. ఈ సమావేశాల్లో నియోజకవర్గాల వారీగా పలు అంశాలను ప్రస్తావించేందుకు ఎమ్మెల్యేలు సన్నద్ధమవుతున్నారు. – సాక్షిప్రతినిధి, ఖమ్మం

శీతాకాల సమావేశాలకు సిద్ధమవుతున్న ఎమ్మెల్యేలు

- స్థానిక సమస్యల ప్రస్తావనకు కార్యాచరణ
- సాగునీటి వనరులు, అత్యధికంగా ఇందిరమ్మ ఇళ్ల సాధనే లక్ష్యం..
- నేటి నుంచి మొదలుకానున్న అసెంబ్లీ సమావేశాలు

‘సీతారామ’పైనే గురి..

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పంటల సాగుకు ప్రధాన నీటి వనరుగా సీతారామ ప్రాజెక్టు మారనుంది. నాగార్జునసాగర్ ప్రాజెక్టు కాల్వలతో కృష్ణా జలాలు పంటల సాగుకు అందుతుండగా.. సీతారామ ప్రాజెక్టు పూర్తయితే మిగిలిన ఆయకట్టుకూ సమస్యలు తీరుతాయి. అంతేకాక ఈ ప్రాజెక్టుతో కృష్ణా, గోదావరి జలాలు అనుసంధానం అవుతాయి. ప్రస్తుతం యాతాలకుంట వద్ద టన్నెల్ పనులు, పాలేరు లింక్ కెనాల్ పనులు కొనసాగుతుండగా.. ఇతర పనులు పూర్తి కావాల్సి ఉంది. రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టుపై ప్రత్యేక దృష్టి పెట్టి నిధులు విడుదల చేస్తేనే అనుకున్న రీతిలో ఫలితాలు వస్తాయి. జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఈ ప్రాజెక్టు పూర్తికి నడుం బిగించిన నేపథ్యాన కొన్ని అనుమతులు.. ఇంకొన్ని నిధులు విడుదల చేస్తే పనులు త్వరగా పూర్తయ్యే అవకాశముంది.

రైతుభరోసా, ఇళ్లకు ప్రాధాన్యత..

సంక్రాంతి తర్వాత అన్నదాతలకు పెట్టుబడి సాయంగా రైతుభరోసా అందిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. రాష్ట్ర ప్రభుత్వం డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఉపసంఘం రైతుభరోసా విధి విధానాలపై మొదటిసారిగా ఖమ్మం కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించింది. ఆ తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా సమావేశాలు నిర్వహించి నివేదిక ఇచ్చింది. దీని ఆధారంగా రైతులకు అందించే సాయం వారికి ఆసరాగా నిలవనుంది. ఇక ఇందిరమ్మ ఇళ్లను అర్హులకు అందించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇప్పటికే మొబైల్ యాప్ ఆవిష్కరించగా ప్రజాపాలన సభల్లో స్వీకరించిన దరఖాస్తుల ఆధారంగా సర్వే చేయనున్నారు. దీంతో జిల్లాలో మొదటి దశగా నియోజకవర్గానికి 3,500 చొప్పున ఉమ్మడి జిల్లాలో 3.50లక్షల మందికి గృహయోగం కలగనుంది.

స్థానిక సమస్యలపై..

నియోజకవర్గాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి శాసనసభ్యులు ఈ సమావేశాలను ఉపయోగించుకోనున్నారు. సీసీ రోడ్లు, డ్రెయిన్లు, పారిశుద్ధ్యం, విద్య, వైద్యం తదితర సమస్యలను అసెంబ్లీలో లేవనెత్తాలని ప్రణాళిక సిద్ధం చేసుకుంటున్నారు. అవసరమైన ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణం, మరమ్మతులు తదితర వాటికి అనుమతుల కోసం ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

పోడు భూముల్లో విద్యుత్ కోసం..



ఏజెన్సీ రైతుల ఇక్కట్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా. గిరిజనులకు పోడు పట్టాలు ఇచ్చినా త్రీఫేస్ విద్యుత్ సమస్య ఉంది. అలాగే, దుమ్ముగూడెం, వెంకటాపురం, వాజేడు మండలాల్లో చెక్ డ్యామ్‌ల నిర్మాణానికి నిధులు కావాలని కోరుతా. భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో సరిపడా వైద్యులు, సిబ్బంది నియామకం, స్పెషాలిటీ వైద్యసేవల కోసం ప్రభుత్వానికి విన్నవిస్తా.

– డాక్టర్ తెల్లం వెంకట్రావు, ఎమ్మెల్యే, భద్రాచలం

సభ దృష్టికి ‘సీతారామ’



ఇల్లెందు నియోజకవర్గానికి సీతారామ ప్రాజెక్టు ద్వారా సాగునీరు అందించాలని కోరతా. ఇల్లెందు – పాఖాల రహదారికి అటవీశాఖ అనుమతులు, కొమరారం, బోడు మండలాల ఏర్పాటు, ఇల్లెందు ఆస్పత్రి అప్‌గ్రేడేషన్ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా. పోడు పట్టాలు ఇచ్చిన భూముల్లో బోర్లు, మోటార్ల ఏర్పాటుకు అనుమతులపై ప్రస్తావిస్తా.

– కోరం కనకయ్య, ఎమ్మెల్యే, ఇల్లెందు

పర్యాటక అభివృద్ధిపై నివేదిస్తా..



వైరా రిజర్వాయర్‌ను పర్యాటకంగా అభివృద్ధి చేసేలా నిధులు మంజూరు చేయాలని ప్రస్తావిస్తా. ఇదే జరిగితే జిల్లాకే తలమానికంగా రిజర్వాయర్ మారుతుందని వివరిస్తా. అలాగే, సీతారామ ప్రాజెక్టు భూ నిర్వాసితులకు నష్టపరిహారం మంజూరు చేయాలని కోరుతా. వైరా మున్సిపాలిటీ అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేయాలని నివేదిస్తా.

– మాలోతు రాందాస్‌నాయక్, ఎమ్మెల్యే, వైరా

ఆరు గ్యారంటీలపై చర్చిస్తా..



రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రకటించిన ఆరు గ్యారంటీలపై అసెంబ్లీలో చర్చిస్తా. ఇంకొన్ని అంశాలను కూడా వాయిదా తీర్మానం ద్వారా ప్రశ్నిస్తా. రైతులకు రూ.2లక్షలలోపు రుణమాఫీపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేస్తా. అంతేకాక ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, కొత్త రేషన్‌కార్డుల జారీ, సన్నబియ్యం పథకాన్ని ప్రస్తావిస్తా.

– కూనంనేని సాంబశివరావు, ఎమ్మెల్యే, కొత్తగూడెం

ఫుడ్‌పార్క్‌కు పరిశ్రమలు వచ్చేలా..



బుగ్గపాడు ఫుడ్‌పార్క్‌కు పరిశ్రమలు మళ్లించాలని కోరుతా. నియోజకవర్గంలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను త్వరగా ప్రారంభించాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా. బేతుపల్లి, లంకాసాగర్ ప్రాజెక్టు సహా ఇతర కాల్వల్లో సిల్ట్ తొలగింపు, చెక్‌డ్యామ్‌ల నిర్మాణం, పోడు రైతుల రుణమాఫీతో పాటు నియోజకవర్గానికి ఎక్కువ ఇళ్లు కావాలని కోరుతా.

– డాక్టర్ మట్టా రాగమయి, ఎమ్మెల్యే, సత్తుపల్లి

పెదవాగు ఆధునికీకరణకు ప్రాధాన్యత



నియోజకవర్గ అభివృద్ధి, సమస్యలపై ప్రధానంగా చర్చిస్తా. గుమ్మడవల్లి వద్ద పెదవాగు ప్రాజెక్టు ఆధునికీకరణకు తొలి ప్రాధాన్యత ఇస్తా. దొంతికుంట చెరువు, ములకలపల్లిలోని మూకమామిడి ప్రాజెక్టు, చండ్రుగొండలోని వెంగళరావు ప్రాజెక్టు, ప్రధాన సాగునీటి చెరువుల అభివృద్ధిపై ప్రస్తావిస్తా. జీరో అవర్‌లో ఇతర అంశాలపై ప్రజావాణి వినిపించేలా ప్రయత్నిస్తా.

– జారే ఆదినారాయణ, ఎమ్మెల్యే, అశ్వారావుపేట

పెండింగ్ పనులపై ప్రస్తావిస్తా



పెండింగ్ సమస్యలపై అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావిస్తా. కరకగూడెం మండలంలో రెండు పంటలకు నీరందించే పులుసుబొంత ప్రాజెక్ట్ పూర్తి, సీతారామ పరిధిలోకి రాని పినపాక, మణుగూరు, అశ్వాపురం, గుండాల మండలాల్లో ఎత్తిపోతల పథకాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా. ఏళ్లుగా పోడు సాగు చేస్తున్న రైతులకు పట్టాల జారీ ఆవశ్యకతను వివరిస్తా.

– పాయం వెంకటేశ్వర్లు, ఎమ్మెల్యే, పినపాక

పోరాటాలే అమరులకు సరైన నివాళి

- మోదీ పాలనలో ప్రభుత్వ రంగం నిర్వీర్యం
- సీపీఐ జాతీయ కార్యదర్శి అమర్జిత్ కౌర్



మాట్లాడుతున్న అమర్జిత్ కౌర్, పక్కన కూనంనేని, శ్రీనివాసరెడ్డి తదితరులు

ఖమ్మంమయూరిసెంటర్ : ప్రజా పోరాటాల కొనసాగింపే అమరవీరులకు అసలైన నివాళి అని ఏఐటీయూసీ జాతీయ ప్రధాన కార్యదర్శి, సీపీఐ జాతీయ కార్యదర్శి అమర్జిత్ కౌర్ అన్నారు. ఖమ్మంలోని మమత మెడికల్ కాలేజీ ఆడిటోరియంలో ఆదివారం నిర్వహించిన పోటు ప్రసాద్ సంస్మరణ సభలో ఆమె మాట్లాడారు. విద్యార్థి దశ నుంచి కార్మిక నాయకుడిగా, సీపీఐ జిల్లా కార్యదర్శిగా ఎదిగిన ప్రసాద్ ఆశయ సాధనకు పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. పాలకులు ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నారని, ఈ దశలో ప్రజా పోరాటాల ఉధృతి అవసరమని అన్నారు. ప్రధాని నరేంద్రమోదీ పాలనలో ఆదాయ, వ్యయాల మధ్య వ్యత్యాసం పెరిగి వేతన జీవులు, ఎగువ, దిగువ, మధ్యతరగతి ప్రజలు ఇబ్బంది పడుతున్నారని విమర్శించారు. దేశ సంపదంతా ఒక శాతం మంది వద్దే ఉంటుండగా, 99 శాతం మంది ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారని అన్నారు. యువత ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక అల్లాడుతున్నారని తెలిపారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ.. తుదిశ్వాస వరకు నిబద్ధత, నిస్వార్థంతో పని చేసిన పోటు ప్రసాద్‌కు నివాళిగా సీపీఐ శత వసంతాల జాతీయ స్థాయి ముగింపు సభ ఖమ్మంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా లక్ష మందితో బహిరంగ సభ ఏర్పాటు చేస్తామన్నారు. సుదీర్ఘ పోరాట చరిత్ర కలిగిన కుటుంబం నుంచి వచ్చిన ప్రసాద్ పార్టీ భావజాల వ్యాప్తిలో ముందువరుసలో నిలిచారని కొనియాడారు. త్యాగాన్ని సంపదగా మార్చుకున్న కుటుంబం వారిదన్నారు. గంగినేని వెంకటేశ్వరరావు రచించిన ఎర్రజెండాల పుస్తకంలో, పుచ్చలపల్లి సుందరయ్య రాసిన ఆదర్శ కుటుంబాల పుస్తకంలోనూ పోటు ఎర్రమ్మ కుటుంబానికి సముచిత స్థానం కల్పించడం గర్వంగా ఉందన్నారు. సీపీఐ సీనియర్ నాయకులు పువ్వాడ నాగేశ్వరరావు, తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాసరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పల్లా వెంకటరెడ్డి, కొండబాల కోటేశ్వరరావు, గుమ్మడి నర్సయ్య, సీపీఎం రాష్ట్ర నాయకులు పోతినేని సుదర్శన్‌రావు, ఏపీ సీపీఐ నాయకులు ముప్పాళ్ల నాగేశ్వరరావు, వనజ, కాంగ్రెస్ నాయకులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, తుమ్మల యుగంధర్, సీపీఐ రాష్ట్ర నాయకులు పర్సా పద్మ, బాగం హేమంతరావు, బీఏఎల్ నాయకులు పోట్ల మాధవరావు, జర్నలిస్టు సంఘాల నాయకులు కె. రాంనారాయణ, ఎ.ఆదినారాయణ తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, ప్రసాద్ కుటుంబసభ్యులు రాజా సాత్విక్, నిర్మల, సక్కుబాయి, కళావతితో పాటు నాయకులు ఎస్‌కే సాబీర్ పాషా, మహ్మద్ మౌలానా, బి.అయోధ్య, జమ్ముల జితేందర్‌రెడ్డి, దండి సురేష్ యర్రా బాబు, జానిమియా, బిజి క్లెమెంట్ పాల్గొన్నారు.

నేటి నుంచి సైన్స్‌ఫేర్

ఏర్పాట్లను పరిశీలించిన డీఈఓ



సూచనలు చేస్తున్న డీఈఓ సోమశేఖర శర్మ

ఖమ్మం సహకారనగర్ : నగరంలోని బల్లేపల్లి ఎస్ఎఫ్ఎస్ హైస్కూల్‌లో జిల్లా స్థాయి సైన్స్‌ఫేర్‌ను సోమ, మంగళవారాల్లో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. సైన్స్‌ఫేర్‌లో పాల్గొనేందుకు ఇన్‌స్పైర్‌కు సంబంధించి 119 ప్రదర్శనలు, విజ్ఞాన శాస్త్రానికి సంబంధించి 486 ప్రదర్శనలు రిజిస్ట్రేషన్ చేసుకున్నాయి. ఇందులో జూనియర్స్, సీనియర్స్ విభాగాల నుంచి ఉత్తమ ప్రదర్శనలను రాష్ట్రస్థాయికి ఎంపిక చేయనున్నారు. సైన్స్‌ఫేర్‌లో ఆహారం ఆరోగ్యం, రవాణా, కమ్యూనికేషన్, నేచురల్ ఫామింగ్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్, మ్యాథమెటికల్ మోడలింగ్, వేస్ట్ మేనేజ్‌మెంట్, రిసోర్స్ మేనేజ్‌మెంట్ అనే విభాగాల్లో ప్రదర్శనలు ఉంటాయని నిర్వాహకులు పేర్కొన్నారు. తొలిరోజు సోమవారం రఘునాథపాలెం, ఖమ్మం రూరల్, ఖమ్మం త్రీటౌన్‌కు చెందిన ప్రభుత్వ, ప్రైవేట్, రెసిడెన్షియల్, ఎయిడెడ్ పాఠశాలలకు చెందిన 6 నుంచి పదో తరగతి విద్యార్థులు, 10వ తేదీన ఖమ్మం అర్బన్, వన్ టౌన్, టూటౌన్ పరిధిలోని పాఠశాలల విద్యార్థులు ప్రదర్శనలు తిలకించవచ్చని డీఈఓ సోమశేఖర శర్మ తెలిపారు. ఆదివారం ఆయన ఎస్ఎఫ్ఎస్ హైస్కూల్‌లో సైన్స్‌ఫేర్ ఏర్పాట్లను పరిశీలించి సూచనలు చేశారు. కార్యక్రమంలో ఖమ్మం అర్బన్, రూరల్, రఘునాథపాలెం, కూసుమంచి ఎంఈఓలు శైలజ లక్ష్మి, శ్రీనివాస్, రాములు, వీరస్వామి సైన్స్ అధికారి జగదీష్, సీఎంఓ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి సమ్మె సైరన్

ఆందోళన బాటలో సమగ్ర శిక్ష సిబ్బంది



నేలకొండపల్లి ఎంఈఓకు సమ్మె నోటీసు ఇస్తున్న సిబ్బంది

ఖమ్మం సహకారనగర్/నేలకొండపల్లి : తమ సమస్యలు పరిష్కరించాలంటూ విద్యాశాఖలోని సమగ్ర శిక్ష ఉద్యోగులు మూడు రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేపడుతున్నారు. అయినా ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో ఈనెల 10వ తేదీ నుంచి సమ్మెబాట పడుతున్నారు. ఈనెల 6 నుంచి విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండానే మండల, జిల్లా కేంద్రాల్లో రిలే నిరాహార దీక్షలు చేస్తున్నారు. సోమవారం వరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి హామీ రాకుంటే మంగళవారం నుంచి సమ్మె చేస్తామని ప్రకటించారు.

ఆగనున్న బోధన..

జిల్లా విద్యాశాఖలో ఏపీఓలు, మండల స్థాయిలో ఎంఐఎస్ కో ఆర్డినేటర్లు, స్కూల్ కాంప్లెక్స్ స్థాయిలో సీఆర్పీలుగా, పాఠశాల స్థాయిలో ఆర్ట్స్, పీఈటీ, వర్క్ ఎడ్యుకేషన్, కేజీబీవీల్లో ప్రత్యేకాధికారులు, సీఆర్‌టీ, పీజీసీఆర్‌టీ, ఏఎన్‌ఎంలు, అకౌంటెంట్లు, క్రాఫ్ట్ అండ్ కంప్యూటర్ ఇనస్ట్రక్టర్లు, కుక్‌లు.. ఇలా పలు విభాగాల్లో మొత్తం 680 మంది పని చేస్తున్నారు. కేజీబీవీలు, అర్బన్ రెసిడెన్షియల్ స్కూళ్లు, భవిత సెంటర్లలోనే 480 మంది పని చేస్తుండగా, సమ్మెకు దిగితే ఆయా పాఠశాలల్లో బోధనకు అంతరాయం వాటిల్లనుంది.

ప్రధాన డిమాండ్లు ఇవే..

- కాంట్రాక్ట్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న తమను రెగ్యులర్ చేయాలి. అప్పటివరకు బేసిక్ పే ఇవ్వాలి
- ప్రతీ ఉద్యోగికి జీవిత బీమా రూ.10 లక్షలు, ఆరోగ్య బీమా రూ.5 లక్షల సౌకర్యం కల్పించాలి
- పీటీఏలకు ఎస్ఎస్ఏల వలే 12 నెలల వేతనం ఇవ్వాలి
- ఎస్ఎస్ఏలు ఉద్యోగ విరమణ చేస్తే బెనిఫిట్స్ కింద రూ.20 లక్షలు చెల్లించాలి

సమ్మెకు సిద్ధమయ్యాం



విద్యాశాఖలో సమగ్ర శిక్ష కింద వివిధ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్నాం. ఈ మేరకు గత మూడు రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్నాం. ఈనెల 9వ తేదీ వరకు సమస్యలు పరిష్కరించకుంటే 10వ తేదీ నుంచి సమ్మెకు వెళ్లాలని నిర్ణయించాం.

– షేక్ మహబూబ్ పాషా, సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు

సానుకూల నిర్ణయం తీసుకోవాలి



మా న్యాయమైన డిమాండ్ల పట్ల ప్రభుత్వం సానుకూలంగా స్పందించి వెంటనే పరిష్కరించాలి. మా స్థితిగతులను కూడా తెలుసుకోవాలి. ప్రభుత్వం ఇప్పటికైనా తగిన నిర్ణయం తీసుకుంటుందని ఆశిస్తున్నాం.

– జి.ఝాన్సీ సౌజన్య, సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

ఉద్యోగ భద్రత కల్పించాలి



ఏళ్ల తరబడి సేవలు అందిస్తున్నాం. ఉద్యోగ భద్రత లేదు. కనీసం వేతనాలు కూడా లేవు. జీవితాలు ఎదుగుబొదుగూ లేకుండా ఉన్నాయి. హామీని అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం. మావి గొంతెమ్మ కోర్కెలు కానందున ప్రభుత్వం వెంటనే దృష్టి సారించాలి.

– పుష్కర్‌కుమార్, నేలకొండపల్లి

నేటితో ముగియనున్న గడువు

- ఎమ్మెల్సీ ఓటు నమోదుకు ఉపాధ్యాయుల ఆసక్తి అంతంతే
- నెల రోజులు గడువు పెంచినా దృష్టి పెట్టని టీచర్లు
- ఇప్పటి వరకు 4,509 మంది ఓటర్లు నమోదు



ఖమ్మం సహకారనగర్: వరంగల్ – ఖమ్మం – నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు కార్యక్రమం సోమవారంతో ముగియనుంది. తొలుత నవంబర్ 6 వరకు ఓటరు నమోదుకు షెడ్యూల్ విడుదలైంది. అయితే దరఖాస్తులు అంతంతమాత్రంగానే రావడంతో మరో నెలరోజులకు పైగా అవకాశం కల్పించారు. 2019 ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా 3,634 మంది ఓటర్లు నమోదు కాగా.. ఈసారి ఇప్పటి వరకు 4,509 మంది నమోదు చేసుకున్నారు.

ప్రతిసారీ కొత్తగా..

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటరు నమోదు ప్రతిసారీ కొత్తగా చేసుకోవాల్సి ఉంటుంది. ఉపాధ్యాయ నియోజకవర్గాల ఓటర్ల జాబితాను ఎన్నికల ముందు తయారుచేస్తారు. గతంలో ఓటరు జాబితాలో నమోదైన వ్యక్తులు కూడా తప్పనిసరిగా ఫారం –19 ప్రకారం మళ్లీ దరఖాస్తు సమర్పించాల్సి ఉంటుంది. ఓటరుగా నమోదు చేసుకునే ఉపాధ్యాయులు గత ఆరు సంవత్సరాల్లో మూడు సంవత్సరాల పాటు విద్యా బోధన చేసినట్లు సంబంధిత విద్యా సంస్థ నుంచి ధ్రువీకరణ సర్టిఫికెట్ జత చేయాల్సి ఉంటుంది.

దరఖాస్తు చేయొచ్చిలా..

ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా ఓటు నమోదు చేసుకోవాలనుకున్న వారు ఫారం–19 ద్వారా స్థానిక తహసీల్దార్ కార్యాలయాల్లో, ఆర్డీవో కార్యాలయంలో నేరుగా దరఖాస్తు సమర్పించే అవకాశం ఉంది. అంతేకాక ceotelangana.nic.in వెబ్‌సైట్‌లోనూ దరఖాస్తు చేసుకోవచ్చు.

సెప్టెంబర్ 30న నోటీస్..

వరంగల్ – ఖమ్మం – నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు నమోదుకు సెప్టెంబర్ 30న పబ్లిక్ నోటీస్ జారీ అయింది. ఫారం–19 ద్వారా ఓటు నమోదు చేసుకునేందుకు నవంబర్ 6 వరకు అవకాశం కల్పించారు. అయితే ఆశించిన స్థాయిలో నమోదు కాకపోవడంతో ఈనెల 9వరకు గడువు పొడిగించారు.

అయినా.. అంతంత మాత్రమే

గత నెల 6 వరకు ఓటరు నమోదుకు గడువు విధించగా.. నమోదు ప్రక్రియ అంతంతమాత్రంగానే సాగింది. దీంతో ఈ గడువును ఈనెల 9వరకు పొడిగించారు. 2019లో జరిగిన వరంగల్ – ఖమ్మం – నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి జిల్లాలో 3,634 మందికి ఓటర్లుగా నమోదు కాగా... అందులో పురుషులు 2,318, మహిళలు 1,316మంది ఉపాధ్యాయులు ఓటర్లుగా ఉన్నారు. ఈసారి ఇప్పటి వరకు 4,509 మంది నమోదు చేసుకున్నారు.

క్లుప్తంగా

కష్టపడి పనిచేయాలి

వేంసూరు: ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాడానికి ఉపాధ్యాయులు కష్టపడి పని చేయాలని టీఎస్‌యూటీఎఫ్ పూర్వ రాష్ట్ర కార్యదర్శి బండి నరసింహారావు కోరారు. టీఎస్‌యూటీఎఫ్ 11వ మండల మహాసభలు వేంసూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించగా.. నరసింహారావు హాజరై మాట్లాడారు. మరోసారి ఎమ్మెల్సీ ఎన్నికల్లో అలుగుబెల్లి నర్సిరెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ నెల 14, 15 తేదీల్లో సత్తుపల్లి నియోజకవర్గంలో జరిగే జిల్లా మహాసభలను, 28, 29, 30 తేదీల్లో నల్లగొండలో జరిగే రాష్ట్రస్థాయి మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నిర్మలకుమారి, జీఎస్ఆర్ రమేశ్, ఎస్కే నాగుర్‌వలీ, ఈశ్వరచారి, సుధాకర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, యాకూబ్‌అలీ, దీన్‌దయాళ్, భాస్కర్‌రావు, రాధాకృష్ణ, ప్రసన్న కుమార్‌నరేశ్, సలీం, కవితశ్రీ, రాగి హైమవతి, మాధవి, యశోద పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి మృతికి సంతాపం


రాము (ఫైల్)

పెనుబల్లి: గుండెపోటుకు గురై యువ ఉపాధ్యాయుడు మృతి చెందగా పలువురు సంతాపం తెలిపారు. పెనుబల్లి బీసీకాలనీకి చెందిన తేజావత్ రాము (40)కు ఆదివారం రాత్రి గుండెపోటు రాగా కుటుంబ సభ్యులు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆయన ప్రస్తుతం చంద్రుగొండ మండలం ఊటుపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఎస్‌జీటీగా మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. స్థానిక నాయకులు బి.కోటేశ్వరరావు, బి.వెంకటేశ్వరరావు, వీవీ రామారావు నివాళులర్పించారు.

కాల్వలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం


గుర్తు తెలియని మృతదేహం

ఖమ్మంరూరల్: మండలంలోని తెల్దారుపల్లి సాగర్ కాల్వలో సుమారు 35 ఏళ్ల వయస్సుగల వ్యక్తి మృతదేహం లభ్యమైంది. పోలీసుల కథనం ప్రకారం.. రెండు రోజుల కిందట కాల్వలో పడి మృతి చెందినట్లుగా మృతదేహం ఆనవాళ్లను బట్టి తెలుస్తోంది. అన్నం సేవా ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావుకు సమాచారం ఇవ్వగా మృతదేహాన్ని వెలికి తీశారు. పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజు తెలిపారు.

ప్రమాదవశాత్తు ఇంట్లో మంటలు

నేలకొండపల్లి: మండలంలోని చెరువుమాధారంలో ఆదివారం ఓ ఇంట్లో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. బాధితుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన షేక్ బాజీవలీ ఇంట్లో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. మంచం, వస్త్రాలు, తలుపులు, ఆటోటైర్లు, డీజిల్ డ్రమ్ములు ఇతర ఫర్నిచర్ పూర్తిగా కాలిబూడిదైంది. స్థానికులు మంటలను అదుపులోకి తీసుకురావటంతో పెనుప్రమాదం తప్పింది. మంటలు ఎలా వ్యాపించాయో తెలియడం లేదని బాధితులు వాపోయారు.

కోడిగుడ్డు ధరకు రెక్కలు

కోడిగుడ్డు ధరకు రెక్కలొచ్చాయి. మునుపెన్నడూలేనివిధంగా ధరలు పలుకుతున్నాయి. ప్రాంతాల ఆధారంగా ఒక్కో గుడ్డు ధర రూ.8కి పైనే పలుకుతోంది. వినియోగం కారణంగా డిమాండ్ పెరిగినా ఉత్పత్తి పెరగని కారణంగా ఈ పరిస్థితి నెలకొన్నట్లు సమాచారం. వేసవిలో ఉష్ణోగ్రతల కారణంగా పౌల్ట్రీ రైతులు కోళ్ల పెంపకాన్ని తగ్గించడంతో రూ.7 వరకు ధర పలికింది. ఆ తర్వాత వర్షాకాలం సీజన్ నుంచి దాదాపు నాలుగు నెలల పాటు కార్తీక మాసం వరకు సాధారణ స్థాయిలోనే నమోదైంది. మళ్లీ ఇప్పుడు డిమాండ్ పెరగడంతో గుడ్డు ధరకు రెక్కలొచ్చాయి. దీనికి తోడు నిర్వహణ వ్యయం పెరగటం కూడా గుడ్డు ధరపై ప్రభావం చూపుతోంది.

– ఖమ్మంవ్యవసాయం/చంద్రుగొండ



విక్రయానికి సిద్ధంగా ఉన్న కోడిగుడ్లు

రిటైల్‌లో రూ.8.. హోల్‌సేల్‌లో రూ.7కు పైమాటే

- రైతుబజార్లలో డజన్ రూ.85
- పెరిగిన వినియోగంతో గుడ్డుకు డిమాండ్
- నిర్వహణ వ్యయం పెరగడం కూడా మరో కారణం

నగరాలు, గ్రామాల్లో ఒక్కోలా..

కోడిగుడ్డు రిటైల్‌లో రూ.8గా.. హోల్‌సేల్‌లో రూ.7.08గా పలుకుతోంది. అయితే ఈ ధరలు ఖమ్మం నగరంతో పాటు జిల్లాలోని పట్టణ ప్రాంతాల్లో నమోదవుతున్నాయి. ఇక మండల కేంద్రాలు, గ్రామాలకు వెళ్లే సరికి మరింత ధర పెరుగుతోంది. మరీ గ్రామీణ ప్రాంతాలకు వెళ్లేలోగా రవాణా చార్జీల కారణంగా రూ.8.50 నుంచి రూ.9 వరకు విక్రయిస్తున్నారు. మరోపక్క హోల్‌సేల్‌లో గుడ్డు ధర రూ.8 వరకు, రైతు బజార్లలో డజన్ రూ.85కు, 30 గుడ్లతో కూడిన ట్రేను రూ.210 వరకు అమ్ముతున్నారు. సాధారణంగా రూ.170 నుంచి రూ.180 వరకు పలికే ట్రే గుడ్ల ధర అమాంతం రూ.30 నుంచి రూ.40 మేర పెరగడం గమనార్హం.

కార్తీకం ముగియగానే..

ఇటీవలే కార్తీక మాసం ముగియగా ఇన్నాళ్లు ఉపవాసాలు చేసిన వారు విరమించారు. సహజంగానే కార్తీక మాసంలో మాంసం, గుడ్డు వినియోగం తగ్గి చికెన్, మటన్‌తో పాటు గుడ్ల ధరలు సాధారణ స్థాయిలో కొనసాగాయి. ఈ నెల 2వ తేదీతో కార్తీక మాసం ముగియగా చికెన్, మటన్‌తో పాటు గుడ్ల వినియోగం పెరిగినట్లు అంచనా. తెలంగాణలోని హైదరాబాద్ పరిసర ప్రాంతాలతో పాటు జిల్లాలోని రఘునాథపాలెం, వైరా, పెనుబల్లి మండలాలే కాక ఏపీలోని గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల నుంచి ఉమ్మడి ఖమ్మం జిల్లాకు కోడిగుడ్లు సరఫరా అవుతుంటాయి.

బ్లాక్ చేశారా?

ఈశాన్య, దక్షిణాది రాష్ట్రాలతో పాటు స్థానికంగా ఆర్డర్లు ఉండటంతో గుడ్ల ధర పెరిగినట్లు ఓ ప్రచారం జరుగుతోంది. దీనికి తోడు డిసెంబర్, జనవరి నెలల్లో క్రిస్మస్, కొత్త సంవత్సరం వేడుకలకు కేక్‌ల అమ్మకం జోరుగా సాగుతోంది. వీటి తయారీలో కీలకమైన కోడిగుడ్లకు డిమాండ్ పెరగనున్నందున కొందరు పౌల్ట్రీఫామ్‌ల నిర్వాహకులు బ్లాక్ చేసినట్లు తెలుస్తోంది.

పెరిగిన నిర్వహణ వ్యయం

కోళ్ల పెంపకానికి అవసరమయ్యే దాణా ధరలు పెరిగాయి. పౌల్ట్రీ ఫామ్‌లలో ప్రధానంగా మొక్కజొన్న, నూకలను వినియోగిస్తారు. మొక్కజొన్నల ధర ప్రస్తుతం రూ.2,200 వరకు పలుకుతోంది. ధాన్యం ధరలపై ఆధార పడే నూకల ధర కూడా పెరిగి రూ.2 వేలకు చేరింది. ఇది కూడా కోడిగుడ్ల ధరలు పెరగడానికి కారణమని పౌల్ట్రీ ఫామ్‌ల నిర్వాహకులు, హోల్‌సేల్ వ్యాపారులు చెబుతున్నారు.

గడిచిన ఐదు నెలల్లో గుడ్డు ధరలు (హోల్‌సేల్)

నెల	ధర (రూ.ల్లో)
ఆగస్టు	5.80
సెప్టెంబర్	6.30
అక్టోబర్	6.40
నవంబర్	6.60
డిసెంబర్	7.08

మరింత పెరుగుతాయేమో..



రానున్న రోజుల్లో కోడిగుడ్ల ధరలు మరింత పెరుగుతాయని తెలుస్తోంది. మేం కొనుగోలు చేసే ధరకు అనుగుణంగా కాస్త పెంచి మేం అమ్ముతుంటాం. ధరల నియంత్రణ ఎవరి చేతుల్లో ఉందో తెలియదు.

–సోమనపల్లి మధు, వ్యాపారి, చంద్రుగొండ

వ్యాపారం బాగా తగ్గిపోయింది..



గుడ్ల ధర పెరగడంతో వ్యాపారం బాగా తగ్గిపోయింది. రోజురోజుకూ ధర పెరుగుతుండటంతో కొనుగోలుకు చాలా మంది వెనుకడుగు వేస్తున్నారు. ఏపీలోని సన్నపేట నుంచి మాకు గుడ్లు వస్తాయి.

–ఎస్కే ఖాజా, వ్యాపారి, చంద్రుగొండ

ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా పాలన

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని


ప్రదర్శన నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు, కార్యకర్తలు

ఖమ్మంమయూరిసెంటర్ : ప్రజాస్వామ్య కోణానికి విరుద్ధంగా ప్రభుత్వాలు పాలన సాగిస్తున్నాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. శ్రీలంక తరహాలో భారత్‌లోనూ కమ్యూనిస్టుల పాలన తథ్యమనే విశ్వాసంతో ప్రజా సమస్యలపై పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఖమ్మంలోని సెయింట్ మేరీస్ పాఠశాల ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన పార్టీ ఖమ్మం డివిజన్ కమిటీ మహాసభలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం వచ్చాక కేసీఆర్ పదేళ్ల ప్రజాస్వామ్య కోణానికి విరుద్ధంగా పాలించారన్నారు. విద్య, వైద్యం, భూమి, ఉద్యోగం, ఉపాధి, సరైన వేతనం, సామాజిక న్యాయం ఉన్నప్పుడే ప్రతి కుటుంబం సోషలిజం తరహాలో జీవిస్తుందని వివరించారు. బూర్జువా పార్టీలు వీటిని ప్రైవేట్ చేతిలో పెడితే కమ్యూనిస్టు రాజ్యంలో మాత్రం విద్య, వైద్యం ఉచితంగా లభిస్తాయని చెప్పారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం తప్పితే మిగిలిన ఏ గ్యారంటీ సంపూర్ణంగా అమలు కాలేదన్నారు. కమ్యూనిస్టుల పోరాట ఫలితంగా కేసీఆర్ ప్రభుత్వం 5 లక్షల ఎకరాలకు పోడు పట్టాలిస్తే.. రేవంత్ రెడ్డి హయాంలో కొత్తగా పట్టాలు ఇవ్వకపోగా భూములు లాక్కునే ప్రయత్నం చేశారని ఆరోపించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం సాయిబాబు, పోతినేని సుదర్శన్, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు ప్రసంగించారు. అంతకుముందు చర్చి కాంపౌండ్ నుంచి బోనకల్ రోడ్డు లోని సెయింట్ మేరీస్ పాఠశాల వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. పార్టీ సీనియర్ నాయకులు బండారు యాకయ్య పతకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు పొన్నం వెంకటేశ్వరరావు, యర్రా శ్రీకాంత్, శ్రీనివాసరావు, మాచర్ల భారతి, బుగ్గవీటి సరళ, కళ్యాణం వెంకటేశ్వరరావు, భూక్యా వీరభద్రం, బండి రమేష్, బొంతు రాంబాబు, ఎంఏ జబ్బార్, దొంగల తిరుపతిరావు, ఎస్. నవీన్ రెడ్డి, నాగసులోచన, అఫ్రోజ్ సమీనా, పి రమ్య, బషీరుద్దీన్, నందిపాటి మనోహర్, బీవీకే మేనేజర్ శ్రీనివాస్‌రావు, పారుపల్లి ఝాన్సీ ,తుమ్మ విష్ణువర్ధన్, మెరుగు సత్యనారాయణ, బండారు రమేష్, ఎస్.కె నాగుల్ మీరా పాల్గొన్నారు.

జలగం సోదరుల పర్యటన


ఓ కార్యక్రమంలో మాజీ మంత్రి జలగం ప్రసాద్ రావు, మాజీ ఎమ్మెల్యే జలగం వెంకటరావు

సత్తుపల్లిటౌన్: మాజీ మంత్రి జలగం ప్రసాద్‌రావు, మాజీ ఎమ్మెల్యే జలగం వెంకటరావు ఆదివారం సత్తుపల్లి మండలంలోని పలు కార్యక్రమాలకు హాజరయ్యారు. వీరిద్దరు ఓ శుభకార్యంలో కలుసుకొని సంభాషించుకోవటంతో పలువురు ఆసక్తి చూపించారు. బుగ్గపాడు విశ్వధర్మక్షేత్రంలో మాజీ ఎమ్మెల్యే జలగం వెంకటరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రామానగరంలో దండు హుస్సేన్ కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు, చెలికాని వెంకటరావు, తుమ్మూరు పెద్దశ్రీనుబాబు, సొసైటీ చైర్మన్ శ్రీరాం ప్రసాద్, బేతి సాంబశివరావు, బొమ్మబోయిన వెంకటేశ్వరరావు, కోటమర్తి సుజాతరావు, నాగళ్ల ప్రసాద్, నరుకుళ్ల సత్యం, రామకృష్ణ, జానీ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన



మాట్లాడుతున్న రాజేంద్రబాబు

ఖమ్మంసహకారనగర్: రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళన బాట పట్టక తప్పదని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం (ఎస్‌జీపీఏటీ) రాష్ట్ర అధ్యక్షులు అర్వేణి రాజేంద్రబాబు అన్నారు. ఆదివారం నగరంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సంఘం జిల్లా అధ్యక్షుడు పరిశ పుల్లయ్య అధ్యక్షతన జిల్లాస్థాయి సదస్సు నిర్వహించారు. రాజేంద్రబాబు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పెన్షనర్ల సమస్యల పరిష్కారంపై నాన్చివేత ధోరణి అవలంబిస్తోందని, ఇటీవలి కాలంలో ఉద్యోగ విరమణ పొందినవారికి అందాల్సిన బెనిఫిట్లు అందించటంలో తీవ్ర జాప్యం జరుగుతోందని తెలిపారు. సదస్సులో ఎంవీ నర్సింగరావు, వి.రాంమనోహర్, దేశ్‌పాండే, వి.మనోహర్‌రాజు, నాగిరెడ్డి, యాదయ్య, అంజయ్య, సూర్యనారాయణ, ఆళ్ల రామారావు, నర్సయ్య, కె.కృష్ణమూర్తి, వెంకటేశ్వర్లు, రవికుమార్ పాల్గొన్నారు.

అ‘పూర్వ’ సమ్మేళనాలు


సత్తుపల్లిటౌన్: 1970 – 72 బ్యాచ్ విద్యార్థులు

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి శ్రీబండి శోభనాచలం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1970 – 72లో చదువుకున్న విద్యార్థులు పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. 51 మందిలో 18 మంది చనిపోగా.. మరికొందరు అనారోగ్యంతో ఉండగా.. 24 మంది ఈ సమ్మేళనానికి హాజరయ్యారు. 52 ఏళ్ల తర్వాత కళాశాలలో కలుసుకోవడంతో ఆనందంతో పొంగిపోయారు. అనంతరం కళాశాలకు రూ.10 వేల విలువైన ప్రింటర్‌ను అందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కొత్తూరు ప్రభాకర్‌రావు, కొక్కండ చంద్రశేఖర్, కుమారస్వామి, దేవరాజ్, సుబ్రమణ్యశాస్త్రి, బండి రఘుపతిరెడ్డి, బండి సత్యనారాయణరెడ్డి, రామచంద్రుడు, కేశవరావు, భాస్కర్‌రెడ్డి, మస్తాన్‌వలీ, సుబ్బారావు, పుల్లారెడ్డి, మాదిరాజు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఎర్రుపాలెంలో..


ఎర్రుపాలెం: సమ్మేళనంలో పాల్గొన్న ఆనాటి విద్యార్థులు

ఎర్రుపాలెం: మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం 1965 – 1966 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు కలుసుకున్నారు. పలు ప్రాంతాల్లో స్థిరపడినవారంతా ఒక్కచోటకు చేరడంతో ఆ ప్రాంగణం సందడిగా మారింది. ఈ సందర్భంగా గత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. కార్యక్రమంలో ప్రకాష్ రెడ్డి, చలపతిరావు, సామినేని రామారావు, కృష్ణారావు, వెంకటేశ్వరరావు, కె.చంద్రశేఖర్‌రావు, లక్ష్మీనారాయణ, నాగేశ్వరి, వెంకట్రావు, తారామోహన్, అన్నపూర్ణ, రామారావు, వీరరాఘవరెడ్డి, పిచ్చయ్య, మస్తాన్, చంద్రమౌళీశ్వరరావు, నాగేశ్వరరావు, మాధవి, రిఖిత, తదితరులు పాల్గొన్నారు.

మాదిగలు ఐక్యంగా ఉద్యమించాలి


డప్పు కొడుతున్న రాజయ్య

కూసుమంచి: మాదిగలు ఐక్యంగా ఉద్యమించి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు సాధించాలని మాజీ డిప్యూటీ సీఎం తాటికొండ రాజయ్య పిలుపునిచ్చారు. ఆదివారం కూసుమంచిలో మాదిగ ఐక్య వేదిక ఆధ్వర్యాన నిర్వహించిన వన సమారాధన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. మాదిగలు ఐక్యంగా ఉంటూ వారి హక్కులను సాధించుకోవాలన్నారు. మాదిగల ప్రయోజనాల కోసం మంద కృష్ణమాదిగ చేపట్టిన ఉద్యమానికి మద్దతు పలకాలని కోరారు. కాగా, తాటికొండ రాజయ్య బస్టాండ్ సెంటర్‌లో డప్పు వాయిద్యకారులతో కలిసి డప్పు కొట్టారు. కార్యక్రమంలో మట్టె గురవయ్య, ఎడవెల్లి ముత్తయ్య, మాదాసు ఉపేందర్, పోలేపంగు ముత్తయ్య, గోపి, చేకూరి రమేష్, భరత్‌చంద్ర, అంబేద్కర్, పరుశురాం, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

దంపతులపై దాడి

కారేపల్లి: మతిస్థిమితం లేని వ్యక్తి మృతిపై అనుమానం రావడంతో మృతుడి కుటుంబ సభ్యులు అదే గ్రామానికి చెందిన దంపతులపై దాడి చేసిన ఘటన మండలంలోని మాణిక్యారం జీపీ రూప్లతండాలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. రూప్లతండాకు చెందిన అవివాహితుడైన భూక్యా హరిదాస్ (45) పుట్టుకతోనే మూగ. మతిస్థిమితం కోల్పోయి ఊర్లోనే తిరుగుతూ, కుటుంబ సభ్యుల వద్ద ఉంటున్నాడు. రెండు రోజుల కిందట గ్రామ సమీపంలోని గ్రామ పంచాయతీ బోరు వద్ద మృతి చెంది ఉండటంతో స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. బోరు వద్ద ఉన్న కరెంట్ వైర్లు తగిలి మృతి చెంది ఉంటాడని భావించి, అదే రోజు అంత్యక్రియలు నిర్వహించారు.

కాగా, హరిదాస్ విద్యుదాఘాతంతో మృతి చెందలేదని, నూనావత్ భావ్‌సింగ్ చేన్లో పత్తి దొంగతనం చేస్తుంటే భావ్‌సింగ్‌తో పాటు కొందరు కొట్టారని, దీంతో హరిదాస్ మృతి చెందాడనే ప్రచారం ఊపందుకుంది. అనుమానం వచ్చిన మృతుడి కుటుంబ సభ్యులు.. ఆదివారం భావ్‌సింగ్‌తో పాటు ఆయన భార్యపై దాడి చేశారు. భావ్‌సింగ్ దంపతులు కారేపల్లి పోలీసులను ఆశ్రయించటంతో ఎస్ఐ రాజారాం ఘటనా స్థలానికి చేరుకొని.. ఇరుపక్షాల నుంచి ఫిర్యాదు తీసుకొని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భయపెడుతున్న మేఘాలు

నేలకొండపల్లి: వాతావరణంలో మార్పులు రావడం .. మబ్బులు పట్టడంతో రైతులు నానాఅవస్థలు పడుతున్నారు. వారంరోజులుగా ఆకాశం మబ్బులతో నిండి ఉండటంతో ధాన్యం కుప్పల వద్ద రైతులు పడిగాపులు కాయాల్సి వస్తోంది. ఆదివారం ఉదయం నుంచి మబ్బులు పట్టి.. వర్ష సూచనలు కనిపించటంతో కుప్పల వద్ద రైతులు జాగారం చేశారు. ఉదయం ఆరబెట్టటం, సాయంత్రం కుప్ప పోయాల్సి రావడంతో రైతులు అవస్థలు పడుతున్నారు. రాజేశ్వరపురం, భైరవునిపల్లి తదితర కేంద్రాల వద్ద రహదారుల వెంట ధాన్యం కుప్పలు కిలోమీటర్ల కొద్ది ఆరబెట్టారు. నిబంధనలు సడలించి వెంటనే కొనుగోలు చేయకపోతే పరిస్థితి దారుణంగా ఉంటుందని పలువురు రైతులు చెబుతున్నారు.

మద్దులపల్లిలో చోరీ

ఖమ్మంరూరల్: మండలంలోని మద్దులపల్లిలోని మణికంఠనగర్‌కు చెందిన రోజా ఇంట్లో ఆదివారం తెల్లవారుజామున చోరీ జరిగింది. రోజా భర్త అయ్యప్పమాల వేసుకోగా.. రెండు రోజుల కిందట శబరిమలై వెళ్లారు. రోజా తన పుట్టింటికి వెళ్లింది. ఇదే అదునుగా భావించిన చోరులు ఇంట్లో చొరబడి బీరువాలో ఉన్న రూ.6 లక్షలు నగదు ఎత్తుకెళ్లారు. ఆదివారం గమనించిన కుటుంబ సభ్యులు సీఐ రాజుకు సమాచారం ఇవ్వగా ఆయన ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

మధిర: మండలంలోని ఇల్లూరు గ్రామ శివారులో సుబాబుల్ తోటలో ఆదివారం పేకాట ఆడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.6,330 నగదు, 10 సెల్‌ఫోన్లు, 5 మోటార్ సైకిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు టౌన్ పోలీసులు తెలిపారు. మొత్తం 11 మంది పేకాట ఆడుతుండగా పోలీసులను చూసి కొంతమంది పరారయ్యారని చెప్పారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

‘మహాలక్ష్మి’కి విశేష స్పందన



మహిళా ప్రయాణికులతో కిటకిటలాడుతున్న ఇల్లెందు ఆర్టీసీ బస్టాండ్ (ఫైల్)

రీజియన్‌లో నవంబరు 30 వరకు మహిళా ప్రయాణికులు, ఆదాయం వివరాలు

డిపో	మహిళా ప్రయాణికులు	ఆదాయం(రూ.లక్షల్లో)
భద్రాచలం	46,66,524	2783.72
కొత్తగూడెం	63,88,729	2927.08
మణుగూరు	61,57,131	3178.07
ఇల్లెందు	15,56,806	676.85
ఖమ్మం	1,01,07,101	4876.11
మధిర	38,45,829	2760.86
సత్తుపల్లి	1,00,81,126	3596.79


- ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణానికి నేటితో ఏడాది
- జిల్లాలో 4.28 కోట్ల మంది మహిళల ప్రయాణం

చుంచుపల్లి: టీజీఆర్టీసీలో అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకానికి మహిళల నుంచి అపూర్వ స్పందన లభిస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆరు గ్యారెంటీల అమల్లో భాగంగా మొట్టమొదట గతేడాది డిసెంబర్ 9న మహిళల కోసం ఉచిత బస్సు సౌకర్యాన్ని ప్రతిష్టాత్మకంగా ప్రారంభించింది. పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ సర్వీసుల్లో ఉచితంగా ప్రయాణించే వెసులుబాటు కల్పించింది. 65 శాతానికి పైగా మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటుండగా, ఆర్టీసీలో 69 శాతంగా ఉన్న ఓఆర్(ఆక్యుపెన్సీ రేషియో) 98 శాతానికి పెరిగింది. లబ్ధిదారులకు అందించే జీరో టికెట్ల ఆధారంగా చార్జీల మొత్తాన్ని ఆర్టీసీకి రాష్ట్ర ప్రభుత్వమే చెల్లిస్తుండగా, ఆర్థికంగా ఊరట కలిగిందని మహిళామణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా కొన్ని చోట్ల ఓఆర్ 100, 110 శాతం కూడా నమోదవుతోంది. సీట్ల సామర్థ్యానికి మించి ప్రయాణికులు బస్సుల్లో ప్రయాణిస్తున్నారు. దీంతో సీటింగ్ సమస్యపై అక్కడక్కడా చిన్న చిన్న వివాదాలు చోటుచేసుకుంటున్నాయి.

ఖమ్మం డిపోలో అధికంగా..

ఆర్టీసీలో ఉచిత ప్రయాణం రావడంతో పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులు ప్రయాణికులతో కిక్కిరిసిపోతున్నాయి. ఖమ్మం రీజియన్ పరిధిలో ఖమ్మం, మధిర, సత్తుపల్లి, కొత్తగూడెం, భద్రాచలం, మణుగూరు, ఇల్లెందు ఏడు ఆర్టీసీ డిపోలు ఉండగా, మహాలక్ష్మి పథకంలో 385 వరకు సర్వీసులు ఉన్నాయి. ఇందులో ఆర్టీసీకి చెందిన పల్లె వెలుగులు 74, ఎక్స్‌ప్రెస్ సర్వీసులు 65 ఉండగా, అద్దె బస్సులకు సంబంధించిన పల్లె వెలుగు సర్వీసులు 121, ఎక్స్‌ప్రెస్ బస్సులు మరో 122 నడుస్తున్నాయి. ఈ సర్వీసులు రోజువారీగా 1.65 లక్షల కిలోమీటర్ల మేర వివిధ ప్రాంతాలకు రోజూ తిరుగుతున్నాయి. రీజియన్ పరిధిలో గతేడాది డిసెంబర్ 9 నుంచి ఇప్పటివరకు 4,28,03,246 మంది మహిళలు ఉచితం ప్రయాణాన్ని సద్వినియోగం చేసుకున్నారు. వీరి టికెట్ల మొత్తాన్ని ప్రభుత్వం ఆర్టీసీకి చెల్లించనుండటంతో సంస్థకు రూ.207.99 కోట్ల మేర ఆదాయం సమకూరినట్లయిందని అధికారులు అంటున్నారు. ఇందులో ఖమ్మం డిపో పరిధిలో అత్యధికంగా 1,01,07,101 మంది మహిళా ప్రయాణికులు ఆర్టీసీలో ప్రయాణించగా, అత్యల్పంగా ఇల్లెందులో 15,56,806 మంది మహిళలు ప్రయాణించారు.

ఉచిత ప్రయాణం వరం



ఆర్టీసీలో అమలవుతున్న మహాలక్ష్మి పథకం మహిళలకు వరంగా మారింది. ఈ పథకం ద్వారా ఎక్కడి నుంచి ఎక్కడైనా ఉచితంగా బస్సులో ప్రయాణించవచ్చు. ఏడాదిగా ఆర్టీసీ బస్సులో వివిధ ప్రాంతాలకు వెళ్లొచ్చాం. ఇలాంటి పథకాన్ని తీసుకురావడం మహిళలు అదృష్టంగా భావిస్తున్నారు.

–నబ్బుని సరస్వతి, ప్రయాణికురాలు

రద్దీకి అనుగుణంగా బస్సులు



మహాలక్ష్మి పథకం ప్రారంభం నుంచి ఖమ్మం రీజియన్‌లో 4.28 కోట్లు జీరో టికెట్లు జారీ చేయగా, రూ.207.99 కోట్ల ఆదాయం వచ్చింది. డిపోల్లో ఆక్యుపెన్సీ రేషియో సైతం భారీగా పెరిగింది. రద్దీకి అనుగుణంగా బస్సులను నడుపుతున్నాం. ప్రయాణికులకు ఇబ్బందులు కలుగకుండా సమన్వయంతో వ్యవహరిస్తున్నాం.

–ఎ.సరిరామ్,ఆర్ఎం

బైక్‌ను ఢీకొట్టిన లారీ : ఒకరు మృతి

ఖమ్మంరూరల్: మండలంలోని కరుణగిరి ఆర్చి వద్ద ఆదివారం రాత్రి ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొట్టిన ఘటనలో ఏనుగు మల్లారెడ్డి (38) అక్కడికక్కడే మృతి చెందాడు. తమ్మినేని రమేశ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం.. సూర్యాపేట పట్టణం వెలుగుమట్లకు చెందిన మల్లారెడ్డి, మండలంలోని పోలేపల్లికి చెందిన రమేశ్ ఖమ్మంలో ఒకే రూంలో ఉంటున్నారు. రాత్రి ద్విచక్రవాహనంపై రమేశ్ స్వగ్రామమైన పోలేపల్లికి వెళ్తుండగా మార్గమధ్యలోని కరుణగిరి ఆర్చి వద్దకు రాగానే లారీ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. దీంతో మల్లారెడ్డి మృతి చెందగా, రమేశ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి...

చింతకాని: రైల్వేస్టేషన్ సమీపంలో ఆదివారం రాత్రి ఎక్స్‌ప్రెస్ రైలు నుంచి జారి పడి సుమారు 45 ఏళ్ల వయసు ఉన్న గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. జీఆర్పీ ఎస్ఐ భాస్కర్‌రావు కథనం ప్రకారం.. చింతకాని రైల్వేస్టేషన్ సమీపంలో ఎక్స్‌ప్రెస్ రైలు నుంచి వ్యక్తి జారిపడి మృతి చెందాడు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని తెలిపారు.

మహిళను ఢీకొట్టిన ఆటో

చింతకాని: మండలంలోని పందిళ్లపల్లి రైల్వేస్టేషన్ వద్ద గాంధీనగర్ కాలనీ గ్రామానికి చెందిన పల్లె దుర్గను ఆటో ఢీకొట్టడంతో గాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం.. దుర్గ గత నెల 23వ తేదీన పందిళ్లపల్లి రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న పనులకు వెళ్లి తిరిగి ఇంటికి వచ్చే క్రమంలో రోడ్డుపై నిలబడి ఉండగా ఖమ్మం నుంచి వస్తున్న ఆటో ఢీకొట్టింది. బాధితురాలి కుమారుడు రవి ఆదివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు బోనకల్ మండలం ముష్టికుంట్ల గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ బొడ్డు రామారావుపై ఎస్ఐ నాగుల్‌మీరా కేసు నమోదు చేశారు.